క్లుప్తంగా

108లో మహిళ ప్రసవం


పాపతో 108 సిబ్బంది

ధర్మసాగర్(వేలేరు): పురిటినొప్పులతో బాధపడుతున్న మహిళను 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. వేలేరు మండల కేంద్రానికి చెందిన ఓ మహిళకు శుక్రవారం తెల్లవారుజామున పురిటి నొప్పులు వచ్చాయి. కుటుంబ సభ్యులు 108కు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న 108 సిబ్బంది మహిళను హనుమకొండలోని మిషన్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువ అయ్యాయి. డాక్టర్ అన్వేష్ సలహా మేరకు ఎమర్జెన్సీ మెడికల్ టెక్నిషియన్లు విద్యాసాగర్, రహీముద్దీన్ సాధారణ కాన్పు చేశారు. దీంతో ఆ మహిళా పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లిబిడ్డలు క్షేమంగా ఉన్నట్లు 108 సిబ్బంది తెలిపారు.

రాబోయేది బీజేపీ ప్రభుత్వమే



దామెర: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ నియోజకవర్గ కో కన్వీనర్ మాదారపు రతన్ కుమార్ అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో శుక్రవారం ఇంటింటికి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మాయమాటలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రతీ పథకంలోనూ కేంద్రం ఇచ్చిన నిధుల వాటా ఉందని వెల్లడించారు. మోదీ నాయకత్వంలోనే దేశావృద్ధి పరుగులు పెడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి రాజ్‌కుమార్, రమేష్, సంతోష్, రమణారెడ్డి తదితరులు ఉన్నారు.

నిర్లక్ష్యం వీడాలి

ధర్మసాగర్: మండల కేంద్రంలో తాటిచెట్లు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు చర్యలు చేపట్టలేదని బాధిత రైతు కొట్టె బాబు తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ధర్మసాగర్ శివారులో సర్వే నంబర్ 553/ఆ లో ఈ నెల 15వ తేదీన కొందరు వ్యక్తులు తాటిచెట్లను తొలగించారని వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌తో పాటు ఎక్సైజ్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేశానని పేర్కొన్నారు. పోలీసులు విచారణ చేపట్టి చెట్లను తొలగించింది వాస్తమని నిర్ధారించారని కానీ ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం ఇటువైపు కన్నెత్తి చూడలేదని ఆరోపించారు. ఫిర్యాదుపై స్పందించాలని ఫోన్‌లో సంప్రదించినా అందుబాటులోకి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు.

కార్మికులను కంటికి రెప్పలా కాపాడుకుంటా

హన్మకొండ: కార్మికులను కంటికి రెప్పలా కాపాడుకుంటానని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కార్మిక శాఖ ద్వారా మంజూరు అయిన మ్యారేజీ బెనిఫిట్‌ను హనుమకొండ సర్క్యూట్ హౌస్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కార్మికుడు నల్ల అవినాష్‌కు అందించారు. ఈ సందర్భంగా చీఫ్‌విప్ మాట్లాడుతూ భవన, నిర్మాణ సంక్షేమ మండలి ద్వారా అనేక మందికి లబ్ధి చేకూరుతోందని వివరించారు. నియోజకవర్గంలో 20వేల మందికి లేబర్ కార్డులు అందజేసినట్లు చెప్పారు. వాటి ద్వారా 9 వేల మందికి ఇప్పటికే లబ్ధి చేకూరిందని గుర్తుచేశారు. భవన, నిర్మాణ, దాని అనుబంధ 54 రంగాల కార్మికులకు సభ్యత్వ నమోదుకు అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో కార్మికశాఖ బాధ్యుడు కేశోజ్ ప్రణయ్, కార్మిక నాయకులు పుల్ల శ్రీనివాస్, ప్రవీణ్, సాయిని రవి పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జరిమానాలు

రామన్నపేట: ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులపై వరంగల్ ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. లైసెన్స్ లేకుండా వాహనం నడుపుతూ పట్టుబడిన నలుగురికి వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి రూ.4,500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ బాబులాల్ తెలిపారు. అలాగే, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 15 మందికి రూ.21,500 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ఆరుగురు మైనర్లను జువైనల్ కోర్టులో చార్జ్‌షీట్ ఫైల్ చేయగా ఐదుగురికి జువైనల్ మెజిస్ట్రేట్ ఒకరోజు బాలల అబ్జర్వేషన్ హోమ్‌కు పంపించినట్లు వివరించారు.

జువైనల్ హోంకు ముగ్గురు బాలుర తరలింపు

కాజీపేట: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాలు నడిపుతూ పట్టుబడిన ముగ్గురు బాలురను జువైనల్ న్యాయమూర్తి ఒకరోజు జువైనల్ హోంకు తరలిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు ట్రాఫిక్ సీఐ కె.రామకృష్ణ తెలిపారు.

అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి


ఐనవోలు: నిరసన తెలుపుతున్న మహిళలు, నాయకులు


శాయంపేటలో: మాట్లాడుతున్ననాయకులు


ధర్మసాగర్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఐనవోలు: రాష్ట్రంలోని అర్హులైన నిరుపేదలకు డబుల్‌బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చుక్కయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినిపతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని నిరుపేదలుకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా రూ. 10లక్షలు, గృహలక్ష్మి ద్వారా రూ. 5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురి కాకుండా హద్దులు ఏర్పాటు చేసి నిరుపేదలకు పంపిణీ చేయాలని కోరారు. వడగండ్ల వానకు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేలు నష్టపరిహారం అందించాలన్నారు. రైతుల పాలిట శాపంగా మారిన ధరణి పోర్టల్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలు పరిష్కరించని పక్షంలో జూలై 3న జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ లింగయ్య, కేవీపీఎస్ మండల కార్యదర్శి రాంకుమార్, నాగరాజు, మహేందర్, రాంకుమార్, శంకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మాణిక్యం,ఏసుబు, పోచమ్మ, గోపాలరావు, సృజన, ప్రమీల, రాధిక, ఎల్లమ్మ, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో..

ధర్మసాగర్: రాష్ట్రంలోని అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చిలుక రాఘవులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. ధర్మసాగర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అర్హులైన నిరుపేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించి ఇస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ ఇప్పటివరకు నెరవేర్చలేదని అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో స్వంత స్థలాలు ఉన్నవారికి రూ. 3 లక్షలతో మూడు విడతలుగా డబ్బులు విడదల చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం మరోసారి మోసం చేసేందుకు కుట్ర చేస్తుందన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మండలంలోని ముప్పారం గ్రామంలో సర్వే నంబర్ 585లో గుడిసెలు వేసుకొని నివసిస్తున్న ఇళ్లు లేని నిరుపేదలు సర్వే చేపట్టి పట్టాలు జారీ చేసి గృహలక్ష్మి పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చని మాటను నిలబెట్టుకోవాలని సూచించారు. హామీలను నెరవేర్చిన తరువాతనే రాబోయే ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు గ్రామాలకు వెళ్లాలని సూచించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ మర్కాల రజినికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటి సభ్యురాలు ఆరూరి భాగ్యలక్ష్మి, నాయకులు వల్లెపు రమేష్, వెల్దురి ప్రమీల, మోడం రాజేశ్వరీ, లావణ్య, కవిత, దీప, తిరుపతి, సరిత, ఉమారాణి, ప్రభాకర్, జయరాజ్, సుగుణ, కమలాకర్, రేణుక, ఉపేంద్ర, నాగులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

శాయంపేట : ఇళ్లు లేకుండా గుడిసెలు వేసుకున్న నిరుపేదలుకు పట్టాలివ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి అన్నారు. మండల కేంద్రంలోని శుక్రవారం ఆయన మాట్లాడారు. పెద్దకోడెపాక గ్రామ శివారులో సర్వే నెంబర్ 633లో గుడిసెలు వేసుకున్న వారందరికీ పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్టోన్ క్రషర్ అనుమతుల కోసం కేవలం 25మందితో మాత్రమే అభిప్రాయ సేకరణ తీసుకోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఈకార్యక్రమంలో మండల నాయకులు సదానందం, అశోక్, క్రాంతికుమార్, రాష్ట్ర నాయకులు సుమన్, గుడిసెవాసులు పాల్గొన్నారు.

తలసేమియా బాధితులకు రక్తదాన శిబిరం

కాజీపేట: తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన ఎల్‌జీ సంస్థ ప్రతినిధులు అభినందనీయులని రెడ్‌క్రాస్ సంస్థ ఉపాధ్యక్షుడు పెద్ది వెంకటనారయణ ప్రశంసించారు. కాజీపేట పట్టణంలో ఎల్‌జీ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా 51 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ కోలా శ్రీధర్, మార్కెటింగ్ మేనేజర్ ఎండీ షాహిద్ బేగ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కర్ణ చిత్ర నటుడికి స్వాగతం

మడికొండ: కర్ణ చిత్ర నిర్మాత, డైరెక్టర్, హీరోగా నటించిన కళాధర్‌కు మడికొండలో స్థానికులు ఘన స్వాగతం పలికారు. మడికొండ గ్రామానికి చెందిన కొక్కొండ కళాధర్.. కర్ణ సినిమా నిర్మాతగా, డైరెక్టర్‌గా, హీరోగా నటించి మొదటిసారి మడికొండకు వచ్చిన సందర్భంగా ఆయనను అభినందించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, కొప్పుల నవీన్‌యాదవ్, కార్తీక్, వినయ్‌కుమార్, బాలరాజు, అరవింద్, రాకేష్, నరేష్, దండిగం రాజుయాదవ్, విక్రమ్, వైకుంఠం, భాస్కర్, విష్ణు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ అకాడమీకి విద్యార్థి ఎంపిక

వరంగల్: నగరంలోని 14వ డివిజన్ రెడ్డిపాలెంలోని ఇన్ఫంట్ జీసస్ కాన్వెంట్ హైస్కూల్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థి కె.అక్షిత్.. వాలీబాల్ అకాడమీకి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపాల్ కృపామరియా, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు.

ఐసీడీఎస్‌ను బలోపేతం చేయాలి


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎల్కతుర్తి: ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచి బలోపేతం చేయాలని కోరుతూ చేపట్టిన రాష్ట్రవ్యాప్త జీపు జాతను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని ముల్కనూర్‌లో శుక్రవారం జీపుజాత వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్త జీపుజాత కార్యక్రమం ఈనెల 28వ తేదీన హన్మకొండ జిల్లా కేంద్రానికి చేరుకోనున్నట్లు తెలిపారు. ఐసీడీఎస్ రక్షణకోసం అంగన్‌వాడీ ఉద్యోగులకు 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫార్సుల ప్రకారం కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ ఉద్యోగ భద్రత కల్పించాలని, సుప్రీమ్ కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్, సీఐటీయూ నాయకులు జయున, కానుకుంట్ల రమాదేవి, స్వరూప, స్వరూప రాణీ, శోభ, రాధ, వీరలక్ష్మి పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూల్‌లో పుస్తకాల విక్రయం

పరకాల: పట్టణంలోని ఓ ప్రైవేటు విద్యాసంస్థలో పుస్తకాలు విక్రయిస్తుండగా ఎంఈఓ రమాదేవి పట్టుకున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు విక్రయిస్తున్నారని ఇటీవల ఏబీవీపీ కార్యకర్తలు విద్యా శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎంఈఓ రమాదేవి శుక్రవారం బిట్స్‌ను తనిఖీ చేయగా ఏలాంటి అనుమతి లేకుండా పాఠశాలలో చదువకుంటున్న విద్యార్థులకు పుస్తకాలు విక్రయించినట్లు నిర్ధారించారు. దీంతో సంబంధిత గదిని సీజ్ చేశారు. పాఠశాలలపై నిరంతర పర్యావేక్షణ ఉంచాలని ఏబీవీపీ నగర కార్యదర్శి వావిలాల వెంకటరమణ కోరారు.

కలెక్టరేట్ ముట్టడికి తరలాలి



మాట్లాడుతున్న కల్యాణ్

పరకాల: రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 26వ తేదీన చేపట్టనున్న జిల్లా కలెక్టరేట్ ముట్టడికి విద్యార్థులు, నిరుద్యోగులు తరలిరావాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్ పిలుపునిచ్చాడు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో ఖాళీలను భర్తీ చేయడంతో పాటు పాఠశాలలకు కావాల్సిన భవన సదుపాయాలు, మధ్యాహ్న భోజనానికి అధిక నిధులు కేటాయించాలనే డిమాండ్ సాధనకు కలెక్టరేట్ ముట్టడి చేపట్టనున్నట్లు తెలిపారు.

నమ్మించి మోసం చేశాడని నిరసన

వరంగల్ అర్బన్: వరంగల్ పెద్దమ్మగడ్డకు సమీపంలో కేఎస్ఆర్ కాలనీ, కాపువాడలలోని స్థలాలను అమ్మి తమను ఓ వ్యక్తి మోసం చేశాడని భూ బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయం ఎదుట బల్దియా రిటైర్డ్ ఉద్యోగి ధర్మరాజు, మహంతు సంతోష్ కుమార్, జనార్దన్, రంగయ్య నిరసన తెలిపారు.

ఘనంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి


పరకాల: శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


ఆత్మకూరు: శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

పరకాల: దేశంలో పౌరసత్వంతో పాటు, కాశ్మీర్‌లో అవరోధంగా ఉన్న ఆర్టికల్ 370 రద్దు కోసం జనసంఘ్‌ను స్థాపించిన గొప్ప వ్యక్తి దివంగత శ్యాంప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సంతోష్‌కుమార్, భద్రాద్రి కొత్తగూడెం పాలక్ దేవునూరి మేఘనాథ్, జిల్లా కార్యదర్శి ఆర్పీ జయంత్ లాల్ అన్నారు. నియోజకవర్గ బీజేపీ కార్యాలయంలో దివంగత శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్టికల్ 370 రద్దు కోసం శ్యాంప్రసాద్ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని నేడు ప్రధాని నరేంద్ర మోదీ సర్కార్ 370ను రద్దు చేయడం గొప్ప విషయమన్నారు. పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, కౌన్సిలర్ భద్రయ్య, ప్రధాన కార్యదర్శి నిరంజన్, ఇంచార్జి రాజవీర్, ఉపాధ్యక్షుడు రంజిత్, పురుషోత్తం, తిరుపతి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు: దేశం సుభిక్షంగా ఉండాలనే దివంగత శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను కొనసాగించాలని బీజేపీ మండల అధ్యక్షుడు సదానందం కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదాన్‌దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, కార్యదర్శి పైడి, రవి, మల్లారెడ్డి, బీజేవైఎం మండలాధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దళితులపై కపట ప్రేమ మానుకోవాలి


మాట్లాడుతున్న విజయ్‌కుమార్

కమలాపూర్: బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ దళితులపై కపట ప్రేమను చూపించడం మానుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఇనుగాల విజయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మర్రిపల్లిగూడెంలో ట్రాక్టర్ కింద పడి మృతి చెందిన దళిత విద్యార్థి ఇనుగాల ధనుష్‌కు జరిగిన ప్రమాదంపై నిజానిజాలు తెలుసుకోకుండా ఈటల రాజేందర్ మాట్లాడుతున్నారని ఆరోపించారు. విద్యార్థి విద్యా దినోత్సవ ర్యాలీలో పాల్గొనలేదని, అతడిని కుక్కలు కూడా తరుమలేదన్నారు. కావాలంటే తమ వద్ద ఉన్న సీసీ పుటేజీలు ఇస్తామన్నారు. కావాలని బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం, దళితులను అవమానించడం మానుకోవాలన్నారు. పీఏసీఎస్ చైర్మన్ సంపత్‌రావు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కేడీసీసీబీ డైరెక్టర్ కృష్ణప్రసాద్, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీకాంత్, కుమారస్వామి, విజయ్, సహదేవ్, మురళి, పున్నం, శ్రీధర్, బాబు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి



నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని 13 యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని కేయూ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ (కుక్టా) ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు క్యాంపస్‌లోని పరిపాలన భవనం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ జేఏసీ చైర్మన్ డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్, జేఏసీ కోకన్వీనర్ చందులాల్, ఉమెన్స్ కన్వీనర్ మధుశ్రీ, మధుకర్‌రావు, గడ్డం కృష్ణ, కల్పన, స్వప్న, చంద్రశేఖర్, లక్ష్మారెడ్డి, చీకటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రి ఇంటి వద్ద కాంట్రాక్టు లెక్చరర్ల ధర్నా

తెలంగాణ రాష్ట్రంలోని యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ గత కొద్దిరోజులుగా వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వివిధ యూనివర్సిటీల కాంట్రాక్టు లెక్చరర్లు హైదరాబాద్‌లో విద్యాశాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డి ఇంటి వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో కేయూ జేఏసీ చైర్మన్ డాక్టర్ కరుణాకర్‌రావు, కన్వీనర్ సాదు రాజేష్, బాధ్యులు చిర్ర రాజు, మాదాసి కనకయ్య, అరూరి సూర్యం, రాష్ట్ర చైర్మన్ డాక్టర్ పరశురాం పాల్గొన్నారు. రెగ్యులరైజేషన్‌పై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు సబితా ఇంద్రారెడ్డి హామీ ఇచ్చారు.

బాధితులకు న్యాయం చేయాలి


పాదయాత్ర చేస్తున్న నాయకులు

కమలాపూర్: మండల కేంద్రానికి చెందిన మొగిలిచర్ల లక్ష్మమ్మ ఇంటికి దారి పునరుద్ధరించాలని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రం నుంచి హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయం వరకు శుక్రవారం పాదయాత్ర చేపట్టారు. గతంలో మొగిలిచర్ల లచ్చమ్మ కుటుంబంపై మొగిలిచర్ల భిక్షపతి దాడి చేసి ఇంటికి వెళ్లే దారిని కబ్జా చేశారని ఆరోపించారు. బాధితులపై అక్రమ కేసులు నమోదు చేయించి భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు ఆరోపించారు. ఈ విషయంపై సర్పంచ్‌కు, పోలీసులు, తహసీల్దార్‌తో పాటు సీఎం కార్యాలయ సిబ్బందికి ఫిర్యాదు చేసినా బాధితులకు ఎలాంటి న్యాయం జరగలేదని వాపోయారు. మొగిలిచర్ల లచ్చమ్మ, శిరీష, విలాస్, అన్వేష్, స్పందన, సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజు, హనుమకొండ జిల్లా కన్వీనర్ మొగిలి, గోవిందు, మోహనకృష్ణ, సావిత్రిబాయి పూలే మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సరోజన, విజయమ్మ, బై భీమ్ పూలే అసోసియేషన్ నాయకులు చిన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



హన్మకొండ చౌరస్తా: ముదిరాజ్ జాతిని దుర్భాషలాడుతూ, వీడియో జర్నలిస్టుపై దాడి చేయడంపై ముదిరాజ్ కులస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను శుక్రవారం హనుమకొండ చౌరస్తాలో దహనం చేశారు. 24 గంటలలోపు ముదిరాజ్ కులస్తులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండలోని మచిలీబజార్, ఏనుగులగడ్డ, గుడిబండల్‌కు చెందిన ముదిరాజ్ కుల పెద్దలు పులి మధు, భయ్యా శోభన్, చింతాకుల ప్రభాకర్, పైడి, సుక్కయ్య, ప్రభాకర్, రవీందర్, సాగర్, హరికృష్ణ, సందీప్, ప్రవీణ్, ప్రకాష్, ముదిరాజ్ కులస్తులు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలు, సామాజిక భద్రతపై అవగాహన


గ్రామీణ మహిళలతో అధికారులు, తదితరులు

మామునూరు: సైబర్ నేరాలు, సామాజిక భద్రతపై గ్రామీణ ప్రాంత మహిళలు అవగాహన పెంచుకోవాలని ఐఎస్ఏసీ రిటైర్డ్ వింగ్ కమాండర్ శ్రీనివాస్, ఎల్‌క్యూబ్ సొల్యూషన్ ఫౌండర్ రమ పట్నాయక్ సూచించారు. ఈమేరకు ఖిలా వరంగల్ మండలం వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో జీ–20, కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా, హైదరాబాద్, వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, సమాచార భద్రతపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వారు మాట్లాడుతూ ఇంటర్నెట్ వాడకం ఎక్కువైన క్రమంలో చాలామంది సైబర్ నేరాల బారిన పడుతున్నారని తెలిపారు. ఈక్రమంలో గ్రామీణ ప్రాంత మహిళలు, విద్యార్థినులు తమ వివరాలు గోప్యంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వాగ్దేవి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రకాశ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుపతిరావు, హెడ్స్ డాక్టర్ సత్యవతి, డాక్టర్ తన్వీర్ జహన్, డాక్టర్ అయేషాబాను, పున్నేలు సర్పంచ్ దేవేందర్‌గౌడ్, బ్యాంక్ అధికారులు అనిల్, ప్రశాంత్, అధ్యాపకులు సలీమ్, జీవాని, మహేష్, పల్లవి, మహేశ్వరి, ఆశ వర్కర్లు, రమణ కుమార్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు సమస్య పరిష్కరించాలి



హన్మకొండ అర్బన్: మడికొండలోని డంపింగ్ యార్డు కారణంగా కాజీపేట మండలంలోని పలు గ్రామాల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని ఈనెల 15న జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు ఏబీసీ సభ్యుడు బక్క జడ్సన్ తెలిపారు. దీనిపై స్పందించిన కమిషన్.. 8 వారాల్లో సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసిందని గుర్తుచేశారు. ఈమేరకు డీసీసీ నాయకుడు మహమ్మద్ అంకుస్‌తో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్సన్ మాట్లాడారు. డంపింగ్ యార్డులోని కాలుష్యం వల్ల చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తీవ్ర శ్వాసకోస వ్యాధులతో బాధపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అనేకసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని విమర్శించారు.

బాధిత కుటుంబానికి ఈటల పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఈటల

కమలాపూర్: మండలంలోని మర్రిపల్లిగూడెంలో ఇటీవల ట్రాక్టర్ కింద పడి మృతి చెందిన ఇనుగాల ధనుష్ కుటుంబ సభ్యులను హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ శుక్రవారం పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకొని మృతి పట్ల సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ పల్లె వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ ఇనుగాల రజిత, బీజేపీ నాయకులు రత్నాకర్, సంపత్, రమేష్, పుల్ల శోభన్‌బాబు పాల్గొన్నారు.